




కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, ఆలయాల చైర్మన్ పదవులపై పలువురి దృష్టి

పార్టీ కోసం కష్టపడిన వారికే ప్రాధాన్యమంటున్న అధిష్ఠానం

# నామినేటెడ్ పదవులపై శ్రేణుల ఆశలు



**'పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది. వారందరికీ తగిన నామినేటెడ్ పదవుల్ని అందించి గౌరవిస్తాం' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఇటీవల అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో ఇప్పటికే ఆయా పదవుల్లో ఉన్న వైసీపీ నాయకులంతా రాజీనామాలు చేశారు. డీసీసీబీ, డీసీఎంఎస్ వంటి కొన్ని పోస్టుల్లో తాత్కాలికంగా అధికారుల్ని పర్సన్ ఇన్‌చార్జులుగా ప్రభుత్వం నియమించింది. ఖాళీగా ఉన్న ఆ పదవుల మీద టీడీపీ శ్రేణులు ఆశలు పెట్టుకున్నారు. ఓ స్థాయి ఉన్నవారికి కార్పొరేషన్లు, ఆలయాలు, మార్కెట్ కమిటీలు వంటివి ఇచ్చినా.. కాస్త చిన్నస్థాయి నాయకులకు మాత్రం జిల్లాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న సింగిల్ విండో అధ్యక్ష పోస్టుల్ని కేటాయించే అవకాశముంది. నామినేటెడ్ పదవులు పరిమితంగా ఉన్నప్పటికీ ఆశించేవారి సంఖ్య అధికంగా ఉంది. ఇక, మరో రెండేళ్లలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థిత్వాల కోసం పలువురు దృష్టి పెట్టారు.**

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● **చిత్తూరులో** ఆశావహులు చాలా మంది ఉన్నారు. ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించిన కటారి హేమలత, చంద్రప్రకాష్, కాజూరి బాలాజీ, సీఆర్ రాజన్‌కు తగిన గౌరవం ఇవ్వడంతో పాటు ఎన్నికల్లో పనిచేసిన మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహన్ సహా గుడిపాల బాలాజీ, త్యాగరాజన్, మహదేవ సందీప్, వసంత్ వంటివారిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. సీఆర్ రాజన్‌కు టికెట్ రాకపోయినా, పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించి న్యాయం చేశారు. ఇక మిగిలినవారు తమ స్థాయికి తగిన పదవులు కావాలని కోరుకుంటున్నారు. డీసీసీబీ, చుడా, టౌన్ ట్యాంకు, మార్కెట్ కమిటీ, దుర్గమ్మ గుడి, కట్టమంచి శివాలయం, ఈశ్వరుడి గుడి చైర్మన్ వంటి పదవులతో పాటు పలు కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను కూడా భర్తీ చేసే అవకాశం ఉంది. నామినేటెడ్ కాకుండా జడ్పీ చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్ వంటి ఎన్నికల ద్వారా భర్తీ చేసే పోస్టులూ ఉన్నాయి. జడ్పీ, మున్సిపాలిటీలో ప్రస్తుతం వైసీపీ పాలకవర్గం ఉండగా.. ఖాళీ అయిన వెంటనే కైవసం చేసుకునేందుకు చిత్తూరు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

● **జీడీనెల్లూరు** నియోజకవర్గంలో పాలసముద్రం భీమినేని చిట్టిబాబు, పెనుమూరు కార్జాల అరుణ, హరిబాబు నాయుడు, జీడీనెల్లూరు స్వామిదాసు, ఎస్ఆర్‌పురం రుద్రప్ప నాయుడు వంటివారు పదవుల్ని ఆశిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో పెనుమూరు, ఎస్ఆర్‌పురం మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టులున్నాయి. ఇక, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ నామినేటెడ్ పోస్టు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబుకు పలుమార్లు తన బయోడేటాను ఇచ్చారు.

● **నగరి** నియోజకవర్గంలో నగరి, పుత్తూరు మార్కెట్ కమిటీలు, నగరిలో దేశమ్మ గుడి చైర్మన్ పోస్టులున్నాయి. ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఏలుమలైతో పాటు గంజి మాధవయ్య, మీరా తదితరులు పదవుల్ని ఆశిస్తున్నారు. వీరితో పాటు గ్రామాల్లో కష్టపడిన అనేక మంది నేతలు ఉన్నారు.

● **పుంగనూరు** నియోజకవర్గంలో టీడీపీ ఓడినా.. పెద్దిరెడ్డి మెజారిటీ భారీగా తగ్గింది. పార్టీ ఇన్‌చార్జి చల్లా బాబు ఆధ్వర్యంలో ఇక్కడ టీడీపీ పుంజుకుంది. ఈ క్రమంలో ఆయనకు ఇన్‌చార్జి పదవితో పాటు రాష్ట్ర స్థాయిలో ఏదో ఒక చైర్మన్ పదవి ఇచ్చే అవకాశముంది. గతంలో రెండుసార్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పనిచేసి.. ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వెంకటరమణరాజు, టీడీపీ కోసం ఏళ్లుగా కష్టపడుతున్న అడ్వకేట్ వెంకటముని యాదవ్ వంటివారు కూడా పదవుల్ని ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో బోయకొండ ఆలయంతో పాటు పుంగనూరు, సోమల, రొంపిచెర్ల మార్కెట్ యార్డులున్నాయి. పార్టీ కోసం శ్రమించినవారికి ఈ నాలుగు చైర్మన్ పోస్టులు దక్కనున్నాయి.

● **పలమనేరులో** బాలాజీ కోఆపరేటివ్ సూపర్‌బజార్, మార్కెట్ కమిటీ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, గంగమ్మ గుడి చైర్మన్ వంటి పోస్టులున్నాయి. సూపర్‌బజార్‌కు దశాబ్దాలుగా సుభాష్‌చంద్రబోస్ చైర్మన్‌గా ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు ఆయన వైసీపీలోకి వెళ్లిన నేపథ్యంలో ఆ పోస్టు టీడీపీ దక్కించుకోనుంది. సింగిల్ విండో అధ్యక్ష పోస్టులున్నాయి. గతంలో ఆస్పత్రి కమిటీ చైర్మన్‌గా చేసిన బాలాజీ నాయుడు, డీవైఈవోగా చేసిన వాసుదేవనాయుడు, బైరెడ్డిపల్లె మండల పార్టీ అధ్యక్షుడు కిశోర్ గౌడ, వి.కోట రామచంద్రనాయుడు, గంగవరం వెంకటరమణారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, సోమశేఖర్ గౌడ్ వంటివారంతా పదవుల్ని ఆశిస్తున్నారు.

● **కుప్పంలో** సీనియర్ నేత పీఎస్ మునిరత్నంకు ఈసారి రాష్ట్ర స్థాయిలో మంచి పదవి దక్కే అవకాశాలున్నాయి. అలాగే వైసీపీ అక్రమ కేసులతో పోరాడి జైల్లో నెల రోజులున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుకు కూడా మంచి పదవి లభించవచ్చు. అలాగే, నేతలు సత్యేంద్ర, శాంతారామ్, బీఎంకే రవిచంద్ర, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, శాంతిపురం ఉదయ్‌కుమార్, విశ్వనాథ్, రామకుప్పం ఆంజనేయరెడ్డి, గుడుపల్లె చంద్రశేఖర్ వంటివారు పదవుల్ని ఆశిస్తున్నారు. ఇక్కడ రెస్కో చైర్మన్, మార్కెట్ కమిటీ, గంగమ్మ గుడి చైర్మన్ పోస్టులున్నాయి.

● **పూతలపట్టు** నియోజకవర్గంలో బంగారుపాళ్యం నుంచి ఎన్‌పీఎస్ జయప్రకాష్, కోకా ప్రకాష్, తవణంపల్లె వెంకటేష్ చౌదరి, పూతలపట్టు యువరాజులు నాయుడు, గోపి తదితరులు పార్టీ కోసం శ్రమించారు. ఇప్పుడు తగిన గుర్తింపు కోసం ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలో కాణిపాకం, అరగొండ ఆలయాలు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టులున్నాయి.

● రూ.25 కోట్ల ఆస్తిని రాసిస్తావా లేదా రాజీనామా చేస్తావా?

● ఎంపీపీకి టీడీపీ నేతల సూటిప్రశ్న

# సవాలు ఏమైంది యువరాజా?

**అసలే ఎన్నికలు. ఆపై అధికారం మత్తులో ఉన్నారు. అంతే నోటికొచ్చినంత సవాల్ విసిరారు. ఇప్పుడా సవాలుకు నిలబడలేక.. సమాధానం చెప్పలేక సతమతమై పోతున్నారా ఎంపీపీ. ఇంతకీ ఆయన చేసిన సవాల్ ఏమిటి? ఏం జరిగిందో ఓసారి చూద్దాం.**



మండల కార్యాలయం ఎదుట టీడీపీ శ్రేణుల ఆందోళన

'వి.కోట మాజీ ఎంపీపీ రంగనాథ్ సొంత గ్రామమైన కుంబార్లపల్లె పంచాయతీలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా నా రూ.25 కోట్ల ఆస్తి ఆయనకు రాసిస్తా. ఒకవేళ వైసీపీకి మెజారిటీ వస్తే రంగనాథ్ ఆస్తిని ప్రజలకు రాసివ్వాలి' అంటూ సార్వత్రిక ఎన్నికల వేళ ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఎంపీపీ యువరాజ్ సవాలు విసిరారు. ఆ ఎన్నికల్లో కుంబార్లపల్లె పంచాయతీలో టీడీపీకి 149 ఓట్ల ఆధిక్యత వచ్చింది. ఎన్నికల ఫలితాల రోజే 'మీ సవాలు ఏమైంది' అంటూ టీడీపీ నేతలు ఎంపీపీని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. దీనికి ఎలాంటి సమాధానం లేదు. ఈ క్రమంలో బుధవారం వి.కోట మండల కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచులతో ఎంపీపీ సమావేశం నిర్వహిస్తారని టీడీపీ నేతలకు సమాచారం వచ్చింది. అంతే.. మండల పరిధిలోని అన్ని పంచాయతీల నుంచీ టీడీపీ శ్రేణులు భారీగా మండల కార్యాలయానికి చేరుకున్నారు. వైసీపీకి చెందిన ఎంపీపీ యువరాజ్ తన సవాల్‌కు కట్టుబడి ఆయన ఆస్తిని మండల ప్రజలకు రాసివ్వాలని టీడీపీ నేతలు, శ్రేణులు డిమాండు చేశారు. దీంతో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నేతలు ఎంపీపీ ఆఫీసువద్దకు రాకుండా సమావేశాన్ని వేరేచోటకు మార్చుకున్నారు. కాగా, ఎంపీపీ చేసిన సవాల్ మేరకు ఆయన ఆస్తిని మండల ప్రజలకు రాసివ్వాలని లేదంటే క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని మండల బీసీ సెల్ కార్యదర్శి నాగరాజ్ డిమాండు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ నేతృత్వంలో టీడీపీ నేతలు మండల పరిషత్ కార్యాలయంలోనికి చేరుకుని ఎంపీడీవోకు గతంలో జరిగిన విషయాన్ని వివరించారు. కార్యాలయంలో సీఎం చిత్రపటం లేకపోవడంతో అధికారుల తీరును తప్పుపట్టారు. వెంటనే చంద్రబాబు చిత్రపటాన్ని తీసుకువచ్చి కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మరోవైపు ఎంపీపీ మండల కార్యాలయానికి రాకుండా, సమావేశ వేదిక మార్చుకోవడంతో వివాదం తలెత్తలేదు.

- వి.కోట

# క్వారీల కథేంటి?

● విస్తృతంగా అధికారుల తనిఖీలు



పాలసముద్రం మండలం తిరుమలరాజుపురంలో క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు



రామకుప్పం మండలం గొరివిమాకులపల్లె వద్ద గ్రానైట్ క్వారీ హద్దులు చూస్తున్న అధికారులు

పాలసముద్రం, జూలై 3: జిల్లాలో క్వారీలు, మైనింగ్ కార్యకలాపాలను పరిశీలించి, పదో తేదీలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలన్న కలెక్టరు ఆదేశాలతో అధికారులు కదిలారు. మండలాల స్థాయిలో అధికారుల బృందాలు బుధవారం ఆయా ప్రాంతాల్లో క్వారీలను పరిశీలించింది. పాలసముద్రం మండలం తిరుమలరాజుపురం, నరసింహాపురం పంచాయతీల్లో క్వారీ పనులను తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో రామనాథరెడ్డి, ఇతర శాఖల అధికారులు తనిఖీ చేశారు. తిరుమలరాజుపురం పంచాయతీలో రెండు అక్రమ క్వారీలను గుర్తించారు. కొన్నిచోట్ల అనుమతులకు మించి ఎక్కువ భాగంలో మైనింగ్ చేసి.. రాతి చెక్కలు, గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించినట్లు ఈ తనిఖీల్లో బయటపడింది. సర్వేయర్ కిరణ్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

**గుడుపల్లె:** గుడుపల్లె మండలం గుండ్లసాగరం, కనమనపల్లె, యామగానిపల్లె పంచాయతీల్లోని 13 క్వారీలను ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. కొన్ని క్వారీలు హద్దులు దాటి నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ప్రతి క్వారీకి సంబంధించి నివేదిక రూపొందించి పంపిస్తామన్నారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ జియాలజిస్టు సుబ్బారెడ్డి, మైన్స్ ఆర్ఐలు రామసుబ్రహ్మణ్యం, ప్రకాష్‌బాబు, సర్వేయర్ తులసీధర్ తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పం:** రామకుప్పం మండలంలోని 16 గ్రానైట్ క్వారీలను భూగర్భగనుల శాఖ పలమనేరు అసిస్టెంట్ జియాలజిస్టు సుబ్బారెడ్డి నేతృత్వంలో అధికారులు తనిఖీ చేశారు. వీటిల్లో నాలుగింటిలోనే పనులు సాగుతున్నట్టు తెలిపారు. తహసీల్దారు శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరన్న, సర్వేయర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**గంగాధరనెల్లూరు:** జీడీనెల్లూరు మండలం 100 గొల్లపల్లె వద్ద క్వారీని అధికారులు తనిఖీ చేశారు. ఈ క్వారీలో లీజుదారుడు 2018 నుంచి క్వారీపనులు చేయకుండా నిలిపేసినట్లుగా గుర్తించారు. మండలంలో మైన్స్‌శాఖ ద్వారా క్వారీల వివరాలు తీసుకొని సర్వేయర్లు, వీఆర్వోలను తనిఖీలకు ఆదేశించినట్లు తహసీల్దార్ రవి తెలిపారు.సర్వేయర్ గణేష్, వీఆర్వో ఫాతిమాబేగం పాల్గొన్నారు.

**పుంగనూరు రూరల్:** పుంగనూరు మండలం రాగానిపల్లె, పాళ్యంపల్లె వద్ద క్వారీలను తహసీల్దార్ శివయ్య, ఇతర అధికారుల బృందం తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. క్వారీలకు కేటాయించిన సరిహద్దులను జియోట్యాగింగ్‌తో తనిఖీ చేశారు. ఎస్ఈబీ సీఐ రాజేశ్వరి, ఆర్ఐ వసీం, సర్వేయర్ ప్రకాశ్, మైన్స్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

● సర్పంచి చేసిన పనులకు ఎంపీపీ భార్య పేరిట బిల్లులు

● ముదరందొడ్డి పంచాయతీలో అధికారుల నిర్వాకం

# దీనికి ఏమంటారు?

**పనులు చేసింది సర్పంచి. తన భార్య పేరిట బిల్లులు చేసుకుంది ఎంపీపీ. వీరిద్దరూ వైసీపీ నేతలే. బంధువులు కూడా. అయినా, అధికారులతో కలిసి ఎంపీపీ అడ్డగోలుగా వ్యవహరించారు. ఎన్నికల వేళ విసిరిన సవాలుపై టీడీపీ నేతలకు సమాధానం చెప్పలేని వి.కోట ఎంపీపీ యువరాజ్.. ఈ బిల్లుల నిర్వాకంపైనైనా బదులిస్తారా అని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.**



బిల్లులు ఇప్పించాలని టీడీపీ నేతలతో కలసి ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచి దామోదర్

వి.కోట మండలం ముదరందొడ్డి పంచాయతీలో సర్పంచి దామోదర్ రూ.కోటికి పైగా పనులు పూర్తి చేశారు. తన బంధువైన ఎంపీపీ యువరాజ్‌కు బిల్లుల కోసం ఎం బుక్కులు అందజేశారు. బిల్లుల కోసం ఏడాదిగా సదరు సర్పంచి అధికారుల వద్దకు తిరుగుతుంటే.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న దామోదర్.. ముదరందొడ్డి పంచాయతీ పరిధిలో 2022లో తాను పనులు పూర్తి చేసి ఎం బుక్కులు రికార్డు చేయించి ఎంపీడీవో కార్యాలయంలో ఇచ్చానని గుర్తుచేశారు. వాటి బిల్లులు తనకు ఇంత వరకు ఎందుకు ఇవ్వలేదని ఎంపీడీవోను ప్రశ్నించారు. ఏ పనులకు చెందిన బిల్లో అని ఎంపీడీవో పరిశీలించగా.. ఆ బిల్లులు ఎంపీపీ యువరాజ్ భార్య షాలిని, మరి కొందరి పేరిట 2024 జనవరిలోనే చెల్లించినట్లు చూపారు. క్షేత్ర స్థాయిలో పనులు తాను చేపడితే బిల్లులు తనకు ఇవ్వకుండా ఎంపీపీ చెప్పినవారికి ఎలా ఇస్తారని సర్పంచ్ నిలదీశారు. ఏదో పొరపాటు జరిగిందని ఎంపీపీతో మాట్లాడి బిల్లులు ఇప్పిస్తానని ఎంపీడీవో సర్ది చెప్పారు. వైసీపీకి చెందిన సర్పంచినైన తనకే.. అదే వైసీపీకి చెందిన, తనకు బంధువైన ఎంపీపీ ఇలా మోసం చేయడం సరికాదన్నారు. తాను చేసిన పనులకు సంబంధించి రూ.13 లక్షల మేరకు బిల్లులు తనకు ఇవ్వకుండా ఎంపీపీ, అధికారులు కుమ్మక్కై స్వాహా చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు పంపారు. ఇంకా తన పంచాయతీలో సుమారు రూ.కోటి వరకు పనులు చేశానని, వాటికి బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, వాటిని తక్షణం తనకు అందజేయాలని కోరారు. లేదంటే న్యాయపోరాటం చేస్తానన్నారు. కాగా, బుధవారం మండల కార్యాలయానికి వచ్చిన టీడీపీ నేతలతో తనకు జరిగిన మోసాన్ని సర్పంచి దామోదర్ వివరించారు. వారితో కలసి ఎంపీడీవోకు తన బిల్లులు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

- వి.కోట

# హాస్టల్ విద్యార్థుల నిర్బంధం

● మద్యం మత్తులో వైసీపీ కార్పొరేటర్ బంధువైన కానిస్టేబుల్ దాష్టీకం

● ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

చిత్తూరు, జూలై 3: చిత్తూరు నగరం సీబీరోడ్డులోని ప్రభుత్వ హాస్టల్‌కు చెందిన పలువురు విద్యార్థులను ఓ కానిస్టేబుల్ మద్యంమత్తులో అక్రమంగా నిర్బంధించి, దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్న పునీత్‌రాజ్,రాజేష్, సూర్య, కార్తిక్, యశ్వంత్, మోహన్, కిరణ్ అనే విద్యార్థులను అక్రమంగా నిర్బంధించి కొడుతున్నట్లు హాస్టల్ వార్డెన్‌కు సమాచారం అందింది. దాంతో వార్డెన్ హాస్టల్ సమీపంలోని ఎస్కే కల్యాణ మండపం వద్దనున్న ట్రాక్టర్ షెడ్డుకు చేరుకున్నారు. షెడ్డులో ముగ్గురు వ్యక్తులతో పాటు మద్యంమత్తులో ఉన్న క్రైమ్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ విద్యార్థులను కొట్టడాన్ని చూశారు. వారిని కానిస్టేబుల్ కులంపేరుతో దూషిస్తూ తీవ్ర పరిణామాలుంటాయంటూ బెదిరించడాన్ని వార్డెన్ గుర్తించారు.ఆ విద్యార్థులను రక్షించేందుకు వార్డెన్ ప్రయత్నించగా..వార్డెన్‌ను సైతం కానిస్టేబుల్ అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ అతని చేతులు, చెంపలపై కొట్టి బెదిరించారు. తనపై ఫిర్యాదు చేస్తే వార్డెన్, విద్యార్థులపై తప్పుడు కేసులు పెడతానని బెదిరించాడు. ఆ కానిస్టేబుల్ వైసీపీ కార్పొరేటర్‌కు దగ్గరి బంధువని సమాచారం. ఈ సంఘటన ఈ నెల ఒకటో తేదీన జరిగింది. మంగళవారం హాస్టల్ వార్డెన్, విద్యార్థులు క్రైమ్ పోలీసుస్టేషన్‌కు రావాలని హుకుం జారీచేస్తూ దొంగతనాలకు పాల్పడేందుకు విద్యార్థులను వార్డెనే పంపినట్లు అంగీకరించాలని బెదిరించారు. బ్లాక్ మెయిల్ చేసే అలవాటు కలిగిన ఆ కానిస్టేబుల్‌పై పోలీసు ఉన్నతాధికారులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు చిత్తూరు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, దీనిపై కేసు నమోదు చేయకపోగా.. పెద్ద మనుషుల సమక్షంలో రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు (సెంట్రల్), జూలై 3: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2024కు అర్హత కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈవో దేవరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల సర్వీసు కలిగి ఉన్న వారు నామినేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 15వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు మండల, డివిజన్, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

చిత్తూరు, జూలై 3: డీఎస్సీ పరీక్షలు రాయాలనుకునే అభ్యర్థులకు తిరుపతిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమాధికారి రబ్బానీ బాషా తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన ఉమ్మడి జిల్లాకు సంబంధించి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 200 మంది అభ్యర్థులను టెట్ మెరిట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఎంపికైన వారికి ఈనెల 15 నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తామని వివరించారు. బీఈడీలో అర్హత సాధించిన అభ్యర్థులు బయోడేటాతోపాటు బీఈడీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి.. 'బీసీ స్టడీ సర్కిల్, 4-171-2, మొదటి క్రాస్, శ్రీకృష్ణానగర్, ముత్యాలరెడ్డిపల్లె, తిరుపతి' చిరునామాలో దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9441456039ను సంప్రదించాలని కోరారు.

## బదిలీల దరఖాస్తులు స్వీకరించం

చిత్తూరు (సెంట్రల్), జూలై 3: విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ బదిలీలు, డిప్యూటేషన్లు, సిఫారసు లేఖలు డీఈవో కార్యాలయంలో స్వీకరించేది లేదని డీఈవో దేవరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

# వైసీపీ ప్రభుత్వంలో అంతా అవినీతే

● సంక్షేమ పథకాలన్నీ ఆ పార్టీ కార్యకర్తలకే

● జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేల ధ్వజం ● అధికారులపై ప్రశ్నల వర్షం



సమావేశంలో హాజరైన సభ్యులు, అధికారులు

చిత్తూరు రూరల్, జూలై 3: వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలిందని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. ఐదేళ్లలో ఎప్పుడూ జరగనివిధంగా బుధవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కొత్త ఎమ్మెల్యేలైనా అధికారులను గుక్క తిప్పుకోనీయకుండా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, జరగని అభివృద్ధిపై నిలదీశారు. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశం మొదట కోరానికి కావాల్సి సభ్యులు రాకపోవడంతో కాసేపు వాయిదా వేశారు. మెల్లగా 28 మంది వరకు జడ్పీటీసీ సభ్యులు హాజరుకావడంతో సమావేశాన్ని మొదలు పెట్టారు. సమావేశం మొదలైన కాసేపటికే చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చారు. వచ్చీరాగానే అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వీరి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు నిల్చుండిపోయారు. 2 గంటలకు ముగియాల్సిన సమావేశం సాయంత్రం 4 గంటల వరకు సాగింది. ఇది సర్వసభ్య సమావేశాన్ని తలపించింది.

## పసుపు కండువాతో వైసీపీ జడ్పీటీసీలు



ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ముగ్గురు వైసీపీ జడ్పీటీసీలు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి పసుపు కండువాలతో హాజరయ్యారు. వీరిలో తిరుమలయ్య (ఏర్పేడు), వెంకట సుబ్బారెడ్డి (శ్రీకాళహస్తి), పి.అర్చనదేవి (తొట్టంబేడు) ఉన్నారు.

● అలాగే, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు నారాయణ వనం జడ్పీటీసీ సుమన్ తనతో పాటు సత్యవేడు, కేవీబీపురం, వరదయ్యపాళ్యం, బీఎన్ కండ్రిగ జడ్పీటీసీలతో కలిసి సమావేశానికి హాజరయ్యారు.

## సీఎం చంద్రబాబు చిత్రపటం ఎక్కడ?



ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించి 20 రోజులు కావస్తున్నా చిత్రపటాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య ప్రశ్నించారు. సమావేశం మొదలు కాగానే.. సీఎం చిత్రపటం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను హాలులో ఏర్పాటు చేయాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో గ్లోరియాను కోరారు. ఆ తర్వాత అధికారులు సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ సభ్యులైనప్పటికీ తమ పేర్లను శిలాఫలకాల్లో అధికారులు వేయడం లేదని, తిరిగి తమ పేర్లతో ఉన్న నూతన ఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

## కొత్త ఎమ్మెల్యేల మాట

### పెండింగ్ బిల్లుల్ని విడుదల చేయండి



టీడీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు కేవలం ఆ పార్టీ వారనే కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేదు. వడ్డీలకు తెచ్చి పనులు చేస్తే బిల్లులు ఆపేస్తే ఎలా? వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేయాలి. గత ఐదేళ్లలో చిత్తూరు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి జరగలేదు. ఎక్కడ చూసినా సమస్యలే. తాగునీటినీ సక్రమంగా సరఫరా చేయని దౌర్భాగ్య పరిస్థితులున్నాయి. ఇక, సంక్షేమ పథకాలన్నీ వైసీపీ కార్యకర్తలకే అందించారు. కాజూరు ప్రాంతానికి చెందిన ఓ వైసీపీ నేత అంగవైకల్యం లేకుండానే పింఛన్లు, ప్రభుత్వం నుంచి ట్రై స్కూటర్ పొందాడని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చింది. ఇక, టీడీపీ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులవుతున్నా జడ్పీ సమావేశ మందిరంలో సీఎం చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేయకపోవడం దారుణం. ఇక మాత్రం క్రమశిక్షణతో అభివృద్ధి చేయకపోతే మేముగానీ, సీఎంగానీ ఒప్పుకొనే పరిస్థితి లేదు.

– గురజాల జగన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే

### కొండలు, గుట్టలూ వదల్లేదు



జీడీనెల్లూరు నియోజకవర్గంలోని రైతులకు నాణ్యమైన విద్యుత్తు అందక మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి. రైతులకు నాసిరకం కరెంటు ఇచ్చి.. క్వారీలకు, గ్రానైట్ ఫ్యాక్టరీలకు మాత్రం 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందిస్తున్నారు. సబ్‌స్టేషన్లలో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లు చాలా మంది రాత్రిళ్లు మద్యం తాగి పడుకుంటున్నారు. విద్యుత్ సరఫరా ఆగినప్పుడు ఫోన్ చేసినా పలకడం లేదు. ఒకవేళ ఫోనుతీసినా సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై విచారించి వారిని తొలగించాలి. కృష్ణాపురం ప్రాజెక్టును మరమ్మతు చేయకుండా దీనికి అరకిలోమీటరు కూడా లేని కత్తెరపల్లి ప్రాజెక్టును రూ.84 కోట్లతో మంజూరు చేయడం దారుణం. కేవలం కమీషన్ల కోసమే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఇలా చేశారు. చెరువులు, ప్రభుత్వ భూములు, కొండలను సైతం నారాయణస్వామి వదిలిపెట్టలేదు. పెనుమూరులోని సర్వే నెంబరు 430లో గత ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో 85 ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే అందులో 75 ఇళ్లు వైసీపీ నాయకులకే ఇచ్చారు. అర్హత లేకున్నా 3 నుంచి 5 సెంట్ల వరకు ఇచ్చారు. ఒక్కో వైసీపీ నాయకుడు మూడేసి పట్టాలు పొందారు. దీనిపై విచారించి పట్టాలు రద్దు చేయాలి. ఎస్ఆర్ పురం మండలంలోని ఓ సర్పంచ్ కూడా భర్త బతికుండగానే ఒంటరి మహిళ అని చెప్పుకొని పింఛను పొందుతోంది. ఇంతలా వైసీపీ నాయకులు దిగజారారు. వైద్య ఆరోగ్య శాఖలో పోస్టులన్నీ కూడా మాజీ మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గం, వైసీపీ కార్యకర్తలకు కేటాయించారని సమాచారం ఉంది. దీనిపై పూర్తి వివరాలను మాకు అందించాలి.

– థామస్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే

### కాంట్రాక్టు ఉద్యోగాలన్నీ పెద్దిరెడ్డి, చెవిరెడ్డి వర్గాలకే



జిల్లాలోని పలు శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలన్నీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరులకే కేటాయించారు. డీఆర్డీఏలో ఇప్పటికీ పలు హోదాల్లో ఉంటూ కొందరు వైసీపీ సర్వేల కోసం పనిచేశారు. తుడాలో కాంట్రాక్టు లేబర్ పేరుతో 60 మందికి పైగా చెవిరెడ్డి ఇంటి వద్ద పీఆర్వోలుగా, వైసీపీ సంబంధించిన పనులు చేస్తున్నారు. వీళ్లకు ఇప్పటికీ తుడా నుంచి జీతాలు అందుతున్నాయి. తిరుపతి రూరల్ తుమ్మలగుంట చెరువులో అభివృద్ధి పేరిట రూ.వంద కోట్ల తుడా నిధులతో చెవిరెడ్డి భారీ స్కాం చేశాడు. నేను అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కానీ, ఆ చెరువులో పార్కులు, కట్టడాల వల్ల గతంలో కురిసిన వర్షాలకు అవిలాల, సాయినగర్, గాంధీపురం, ఓటేరు, పేరూరు ప్రాంతాల్లో వరద ప్రవహించి దెబ్బతిన్నాయి. చెరువులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలున్నా.. తుమ్మలగుంట చెరువులో మాత్రం ఈ పనులకు నిధులు ఎలా విడుదల చేశారు? వీటికి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలి. ఇక, మామండూరు జగనన్న కాలనీలో చెవిరెడ్డి దగ్గర పనిచేసే గన్‌మ్యాన్, పీఆర్వోలు, వైసీపీ నాయకులకు వారి బినామీ పేర్లతో ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి. తిరుపతి రూరల్‌కు తెలుగు గంగ నీటి సరఫరా కోసం గతంలో ఇచ్చిన జీవోను అమలు చేసి కొత్తగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. అలాగే కార్యదర్శులతో చెవిరెడ్డి కాన్ఫరెన్స్‌లోకి తీసుకొని మాట్లాడటంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

– పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

### ఐదేళ్లలో అభివృద్ధినే మరిచారు



ఈ ఐదేళ్లలో పూతలపట్టు నియోజకవర్గంలో అభివృద్ధిని పట్టించుకోలేదు. కొన్ని గ్రామాల్లో తాగునీరు లేకుంటే, మరికొన్నిగ్రామాల్లో కాలువలు, రోడ్లు సరిగా లేవు. తవణంపల్లె మండలం టీ కొత్తూరు గ్రామంలో బోరు మోటరు కాలిపోతే నిధుల్లేక ఆ సర్పంచి ఏం చేయాలో తెలియక ఇబ్బంది పడ్డారు. గడిచిన ఐదేళ్లలో రూ.126 కోట్లతో అభివృద్ధి చేసినట్లు రికార్డుల్లో చెబుతున్నా.. అవెక్కడా కనపడడం లేదు. కనీసం వారానికి ఒకసారి తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. ప్రజలు డయేరియాతో అల్లాడిపోతున్నారు. ఇకనైనా ప్రతి వారం ట్యాంకును శుభ్రం చేయించి.. ఆ ఫొటోలను తెప్పించుకోండి. ఇకపై అధికారుల పనితీరులో జవాబుదారీతనం ఉండాలి. బాగున్నవారూ అంగవైకల్యం పింఛన్లు తీసుకుంటుండటంపై విచారించాలి. గత ప్రభుత్వంలో ఐరాల మండలం, నాంపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన ఓ పిల్లవాడు 100 శాతం అంగవైకల్యంతో ఉన్నా ఏవో కారణాలు చూపి పింఛన్ ఇవ్వకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో చదివి ఆశ్చర్యపోయా. ఇవన్నీ మారాలి లేదంటే మారుస్తా.

– మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

## హైకోర్టు అసిస్టెంట్ ప్లీడర్‌గా శరత్‌కుమార్



కుప్పం, జూలై 3: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా కుప్పానికి చెందిన ఎస్.శరత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేశ్ అభినందనలు తెలిపారు. నీతి నిజాయితీలతో కూడిన పనితీరుతో శరత్‌కుమార్ మరిన్ని పదవులు అధిష్ఠించాలని ఆయన ఆకాంక్షించారు.

## మమ్మల్ని ఆదుకోండి

### పోలీసులకు వృద్ధ దంపతుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వృద్ధ దంపతులు

పుంగనూరు రూరల్, జూలై3: 'కన్న కొడుకులే ఇంటి నుంచి బయటకు గెంటేశారు.. తమను పోలీసులే ఆదుకుని న్యాయం చేయాలంటూ' వృద్ధ దంపతులు బుధవారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు మండలం ఏతూరు పంచాయతీ నల్లగుట్లపల్లెకు చెందిన గంగులప్ప(95), అతని భార్య అక్కులమ్మ కలసి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏకైక కుమారుడైన అన్నయ్య మద్యానికి బానిస కావడంతో అతడి భార్య పుష్పావతి కుటుంబాన్ని పోషిస్తోంది. వృద్ధులైన తమపై ఇటీవల కొట్టి ఇంటిలో నుంచి అన్నయ్య భార్య, కుమార్తె, ఆమె భర్త మనోహర్‌లు బయటకు గెంటివేశారని వాపోయారు. తమను చంపివేస్తామని, ఖాళీ పేపర్‌పై తమ బొటనవేలుతో ముద్రలు వేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు మాకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

## రూ.1.87 కోట్లకు పార్కింగ్ ఫీజు వేలం

ఐరాల(కాణిపాకం), జూలై 3: కాణిపాకంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసే హక్కును రూ.1,87,29,999కు కైవసం చేసుకున్నారు. పంచాయతీ, ఆలయ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన వేలంలో వడ్రాంపల్లె పంచాయతీ మిట్టఇండ్లకు చెందిన ఆర్.మనోహర్‌నాయుడు కుమారుడు సురేష్ హెచ్చు పాటదారుడిగా నిలిచి పార్కింగ్ వసూలును కైవసం చేసుకున్నారు. కాణిపాకం పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి పాల్గొన్నారు.

## సీఎం పర్యటన అర్జీలను త్వరగా పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్, జూలై 3: గతనెల 25, 26 తేదీల్లో కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు స్థానిక ప్రజలు అందించిన 1,140 అర్జీలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆయన సమీక్షించారు. సీఎం రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలన్నారు. శాఖల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ వివరాలను జత చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డ్వామా పీడీ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్

ఐరాల(కాణిపాకం), జూలై 3: ఉమ్మడి చిత్తూరు జిల్లా రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడిగా ఎంఎల్.ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. కాణిపాకంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా రవిచంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్‌ను, కోశాధికారిగా రవిని ఎన్నుకున్నారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చిత్తూరు డివిజన్ అధ్యక్షుడు జయరామ్‌నాయుడు పాల్గొన్నారు.

## నీరనుకుని యాసిడ్ తాగి డ్రైవర్ మృతి



చంద్రశేఖర్ (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, జూలై 3: మద్యం మత్తులో తాగే నీరు అనుకుని యాసిడ్ తాగి డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్(40) మొగిలిలోని ఒక కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీన అధిక మోతాదులో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. బాత్రూమ్‌ను శుభ్రపరిచేందుకు ఉంచిన యాసిడ్‌ను నీరు అనుకుని తాగేశాడు. వాంతులవుతుండడంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పురిటిబిడ్డ మృతి

వైద్యుల అలసత్వమంటున్న తల్లిదండ్రులు ● విచారణ జరిపిన వైద్యఆరోగ్యశాఖ అధికారులు





బిడ్డ మృతిపై తల్లి పూర్ణిమను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మురళీకృష్ణ - మృతి చెందిన మగబిడ్డ

పుత్తూరు అర్బన్/కార్వేటినగరం, జూలై 3: పొత్తిళ్లలోనే ఆ బిడ్డకు నూరేళ్లు నిండాయి. కళ్లు విప్పి లోకం చూడకనే లోకం విడిచివెళ్లిపోయాడు. పుట్టిన మరునాడే విగతజీవుడయ్యాడు. వైద్యుల అలసత్వం కారణంగానే ఈ ఘోరం జరిగిందని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ జరిపారు. వివరాల్లోకి వెళితే.. కార్వేటినగరం మండల పరిధిలోని ద్వారకానగరానికి చెందిన జి.నరేష్ భార్య పూర్ణిమ పురిటి నొప్పులతో తొలి కాన్పు కోసం సోమవారం సాయంత్రం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. అదే రోజు రాత్రి ఆమెకు గైనకాలజిస్ట్ హిమబిందు కాన్పు చేయడంతో మగబిడ్డను ప్రసవించింది. మంగళవారం రాత్రి రౌండ్స్‌కు వచ్చిన డాక్టర్ దినేష్ బిడ్డ ఉలుకుపలుకు లేకుండా ఉండడంతో ప్రత్యేక వార్డుకు తీసుకెళ్లి పరీక్షలు జరిపారు. అరగంట తరువాత బిడ్డ మృతి చెందినట్లు చెప్పడంతో పూర్ణిమ దంపతులు నిశ్చేష్టులయ్యారు. బిడ్డ లేడనే విషయం తెలిసి పూర్ణిమ సొమ్మసిల్లిపడిపోయింది. కాన్పు తరువాత వైద్యులు, నర్సులు బిడ్డ ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోలేదని బిడ్డ తల్లిదండ్రులు ఆరోపించారు. కనీసం పూటకు ఒక్కసారి కూడా వచ్చి బాలింతను, బిడ్డను పరీక్షించలేదన్నారు. ఈ కారణంగానే తమ బిడ్డ మృతి చెందాడని కన్నీటిపర్యంతమయ్యారు. ఇది జరుగుతుండగానే డ్యూటీ డాక్టర్ అశోక్‌కు బాధిత బంధువుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఆసుపత్రి ఆవరణం అరుపులు, కేకలతో దద్దరిల్లింది.

**జిల్లా అధికారుల విచారణ**

పురిటి బిడ్డ మృతి చెందిన సంఘటనపై బుధవారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మురళీకృష్ణ విచారణ జరిపారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులతో పాటు నర్సులను వేరువేరుగా విచారించారు. దీనిపై ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి 10గంటల సమయంలో బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గుర్తించిన డాక్టర్ దినేష్ కృత్రిమ శ్వాస ఇచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. బిడ్డ పాలు తాగినప్పుడు ఊరిపితిత్తుల్లోకి వెళ్లడంతో మృతి చెందినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి కూడా బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో పసిబిడ్డ మృతిపై విచారణ జరిపారు. బాధితులు చిత్తూరు జిల్లా, కార్వేటినగరం మండలంకు చెందిన వారు కావడంతో తహసీల్దారు పుష్పకుమారి ప్రభుత్వ ఆసుపత్రిలో పసిబిడ్డ మృతదేహానికి పంచనామా నిర్వహించారు. బిడ్డ తల్లిదండ్రులు, వైద్యులు, నర్సులను సైతం విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. నివేదికను చిత్తూరు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

## 'మొరవను మింగేశారు'పై విచారణ



పుంగనూరు వద్ద తీగలమ్మచెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుంగనూరు, జూలై 3: పుంగనూరు బైపాస్‌రోడ్డులో తీగలమ్మచెరువు మొరవ ఆక్రమణలు, జేన్యూటౌన్ వెంచర్ అక్రమాలపై విచారించి నివేదిక పంపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'మొరవను మింగేశారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. తీగలమ్మ చెరువునుంచి జేన్యూటౌన్ వెంచర్ స్థలం నుంచి వెళ్లే మొరవపై మూడు సిమెంట్ పైపులతో మొరవ కుదించడం, తీగలమ్మచెరువులో బావులు తలపించేవిధంగా మట్టి తవ్వకాలు, వెంచర్ స్థలాన్ని తహసీల్దారు శివయ్య, ఇరిగేషన్ ఏఈ బాబురాజేంద్రప్రసాద్ సందర్శించారు. వెంచర్ స్థలంలో మొరవలో సిమెంట్ పైపులు సొంతనిధులతో ఏర్పాటుకు పలమనేరు ఇరిగేషన్ ఈఈ అనుమతి ఇచ్చారని, వెంచర్ ఏర్పాటుకు అన్ని అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు అధికారులకు తెలిపారు. వెంచర్ యాజమాన్యం వద్ద ఉన్న అనుమతుల పత్రాలు, వెంచర్‌లో చేపట్టిన పనులు గురించి, బైపాస్‌రోడ్డు వద్ద బ్యూటిఫికేషన్, రోడ్లు, చెట్లు తహసీల్దార్ పరిశీలించి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సంఘటన స్థలం నుంచే ఫోన్‌లో సమాచామిచ్చారు. వెంటనే సమగ్రంగా తమకు నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వసీం, సర్వేయర్లు ప్రకాశ్, దేవిక, జ్యోతి, వీఆర్వోలు విజయకుమార్‌రెడ్డి, రత్నప్ప పాల్గొన్నారు.

# కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు !

దగ్గరదారికోసం తెరవాలంటున్న రెండు కాలనీల జనం



కార్పొరేషన్ రోడ్డుకు అడ్డుగా పెట్టిన గేట్లు

తిరుపతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలో మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు అందుబాటులో లేక మూడున్నరేళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేసేశారు.వైసీపీ పాలనలో దాదాపు రూ.80లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి పెద్దిరెడ్డి ఇంటి చుట్టూ సిమెంటు రోడ్లు వేశారు. మారుతీనగర్-రాయల్ నగర్ ప్రాంతాలను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55 లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20) మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చారు.నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా సిమెంట్ రోడ్డును వేశా రు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డుల్లో నమోదైవుంది.ఆ వీధి నుంచి ఈ వీధికి కొత్త రోడ్డుద్వారా దాదాపు 300 మీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. లేదంటే కిలోమీటరుకు పైగా చుట్టుకుని వెళ్లాల్సి వుంటుంది.కానీ రోడ్డు వేసిందే తడవుగా మాజీ మంత్రి ఇరువైపులా రెండు బలమైనగేట్లు పెట్టించేశారు.ఆయనతో పాటు వారి అనుచరుల వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. మంత్రి ఇంటి సమీపంలో వున్న బండారు ఆంజనేయ స్వామి ఆలయానికి పక్కన రోడ్డుకు రూ9.71 లక్షల (ఐఎఫ్‌బి నెం:170/19-20) అంచనాతో ఒకటి, ఆలయానికి దక్షిణం వైపు రోడ్డు రూ9.90లక్షల అంచనాతో ఒకటి (ఐఎఫ్‌బి నెం:205/19-2), దీంతోపాటు రూ4.65లక్షలతో 8-49/1 నుంచి ఎయిర్‌బైపాస్ రోడ్డుకు చేరేలా మరో రోడ్డు పనులకు అంచనా వేసి నామినేషన్ కింద టెండరిచ్చి ఆగమేఘాల మీద పనులను పూర్తిచేశారు.ఈ మూడు రోడ్లు స్థానికులకు అందుబాటులో వున్నాయి. పెద్దిరెడ్డి గేట్లు వేసి మూసేసిన రోడ్లుకూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై గత సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో టీడీపీ నేతలు కమిషనర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు.

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు

### కుప్పంలో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కుప్పం, జూలై 3: కుప్పంలోని మండల సచివాలయంలో గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంటదాకా రైతులు, ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చన్నారు. ఫిర్యాదులు, వినతులపై జిల్లా, నియోజకవర్గ అధికార యంత్రాంగం వీలైనంత త్వరగా స్పందించి పరిష్కారాలు చూపుతుందని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### స్కిల్ హబ్‌లో శిక్షణార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



పలమనేరు, జూలై3 : పలమనేరు ప్రభుత్వ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో అకౌంట్ ఎక్జిక్యూటివ్ కోర్సు శిక్షణ పొందిన 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఎం. వెంకటేసులు, వెంకటగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయశేఖరం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎం.వెంకటేసులు మాట్లాడుతూ స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారిలో 90శాతం మందికి ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. శిక్షణ తీసుకోవాల్సిన వారు కళాశాలలో వి. సిసింద్రీ ఫోన్ నం. 8465830771ను సంప్రదించవచ్చన్నారు.

### తిరుమలకు కూరగాయల వితరణ



పలమనేరు, జూలై 3 : పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకుడు కాప్పల్లి రవీంద్రరెడ్డి దాతల సహాయంతో బుధవారం సుమారు రూ. 1.5 లక్షలు విలువ చేసే 10 టన్నుల కూరగాయలను తిరుమల నిత్యాన్నప్రసాదం కోసం పంపించారు. పలమనేరుకు చెందిన కిషోర్ స్వామి, ట్రాన్స్‌పోర్టు యజమాని మోహన్‌రెడ్డి, ఎల్లంపల్లి అమరనాథరెడ్డి తమ సొంత డబ్బుతో పలమనేరు మార్కెట్ యార్డులో వివిధ రకాల కూరగాయలను కొనుగోలు చేసి టీటీడీ ప్రత్యేక వాహనంలో తిరుమలకు పంపించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డులోని బాబు, సోమశేఖర్‌నాయుడు, ఓకేఆర్ మండీ యజమాని పాల్గొన్నారు.

### కుప్పం లయన్స్ క్లబ్‌కు 10 అవార్డులు



అవార్డులతో మహేశ్ తదితరులు

కుప్పం, జూలై 3: కుప్పం లయన్స్ క్లబ్ సేవలకు అంతర్జాతీయ లయన్స్ క్లబ్ తరపున వివిధ విభాగాలలో 10 అవార్డులు లభించినట్లు లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ ఎ.మహేశ్ తెలిపారు. బెంగళూరులో నిర్వహించిన ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ అవార్డు కార్యక్రమంలో ప్రతినిధులనుంచి ఈ అవార్డులు అందుకున్నట్లు పేర్కొన్నారు. ఉచిత గుండె వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు, పాఠశాలలకు క్రీడాసామగ్రి పంపిణీ, ఉచిత యోగ తదితర సేవా కార్యక్రమాలకు ఈ అవార్డులు ఇచ్చారని చెప్పారు. కుప్పంలో బుధవారం ఓ సమావేశం ఏర్పాటు చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కుప్పం అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, కార్యదర్శి సెల్వం, కోశాధికారి ప్రసాద్, సభ్యులు సెంథిల్, చరణ్, కృష్ణమూర్తి, నితిన్, శివ పాల్గొన్నారు.

### నూతన బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, జూలై 3: కుప్పం ఆర్టీసీ బస్సు సర్వీసులలో ప్రయాణం ఇక సుఖవంతంగా ఉంటుందని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మకంపల్లెనుంచి కుప్పానికి నూతన బస్సు సర్వీసును ఆయన ఆర్టీసీ అధికారులు, ప్రజలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కుప్పం ఆర్టీసీతోపాటు మొత్తం నియోజకవర్గానికి పూర్వ వైభవం తెస్తామన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు త్వరలోనే అన్ని గ్రామాల అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజశేఖర్, కృష్ణయ్య, ఏవీ.రవి, సంతూరప్ప, వసంతమ్మ, సుబ్బు, నాగరాజు, వెంకటేశ్, విజయ్, గోపి, మణి, కదిరప్ప, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

సోమల, జూలై 3: గ్రామాల్లో చిన్నపాటి విషయాలకు ఘర్షణలకు దిగకుండా సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ వెంకట నరసింహులు సూచించారు. బుధవారం కందూరు బస్టాండ్‌లో స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు వేగంగా నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇవ్వరాదని, అలా ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు. సారా అమ్మకాలపై కఠినచర్యలు తీసుకుంటా మన్నారు. రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన

సోమల, జూలై 3: డయేరియా, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కందూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి కోరారు. బుధవారం పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సీజనల్ వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుమార్, బాలాజీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సోమలలో ఉరుసు ఉత్సవాలు

సోమల, జూలై 3: సోమల దర్గా వీధిలోని మహబూబ్ సుబహాని దర్గాలో ఉరుసు ఉత్సవాల్లో భాగంగా పురవీధుల్లో గంధం ఊరేగింపు, ఫకీర్ల జోహర్లతో కోలాహలంగా సాగింది. ఈ నేపథ్యంలోనే దర్గాగుట్ట వీధిలో విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. రాత్రి బెంగుళూరుకు చెందిన కళాకారులతో ఖవ్వాలీ పోటీలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. రేణిగుంట గౌసియా దర్గా మత గురువు సుబేర్ హయాత్ అలీషా ఖాదరీ ఆధ్వర్యంలో ప్రార్థనలు, చదివింపులు నిర్వహించారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు జరిపారు. అధిక సంఖ్యలో హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.



మత గురువుల ప్రార్థనలు

### 8 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

రొంపిచెర్ల, జూలై3: మండలంలోని 8 మంది ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ రాజీనామా చేసినట్లు ఎంపీడీవో రెడ్డెప్పఆచారి బుధవారం తెలిపారు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీకి చెందిన ఓబులేష్, రొంపిచెర్ల బాలాజీ, బోడిపాటివారిపల్లె మహేష్, మోటుమల్లెల కరీముల్లా, గానుగచింత ఖాదర్‌బాషా, పెద్దగొట్టిగళ్లు చలపతి, బండకిందపల్లె శ్రీనివాసులు తమ రాజీనామా పత్రాలు ఎంపీడీవోకు ఇచ్చారు. తమ వ్యక్తి గత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆయనకు చెప్పారు.

### నేడు రొంపిచెర్ల మండల సమావేశం

రొంపిచెర్ల, జూలై3: రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన గురువారం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

### సోమలలో మోస్తరు వర్షం

సోమల, జూలై 3: సోమల మండలంలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం గంటపాటు పడింది. వేరుశనగ విత్తనాలు విత్తుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టమోటా తోటల్లో నీరు నిలువడంతో వాటిని తొగించడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. సోమల, పెద్దఉప్పరపల్లె, నంజంపేట, ఆవులపల్లె తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.

### మండిపేటలో పారిశుధ్య పనులు



పలమనేరు, జూలై 3 : మండలంలోని మండిపేటలో బుధవారం పంచాయతీ కార్యదర్శి బాలరాజు రాథోడ్ మురుగునీటి కాలువల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టారు. మురుగునీటి కాలువల్లో పూడిక తీయించడంతోపాటు కాలువల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. మురుగునీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు పారిశుధ్య చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

### అనారోగ్యంతో ఆడిటర్ మృతి



పలమనేరు, జూలై3 : పలమనేరుకు చెందిన సీనియర్ ఆడిటర్ మోహన్‌శాస్త్రి (70) బుధవారం బెంగళూరులో మృతి చెందారు. ఏడాదిక్రితం రోడ్డుప్రమాదంలో గాయపడిన మోహన్‌శాస్త్రి చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు పలమనేరులో గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా మోహనశాస్త్రి సోదరి రెడ్డెమ్మ కూడా బుధవారం ఉదయం మృతిచెందడంతో వారి కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది.

### నోటు పుస్తకాల పంపిణీ



రామకుప్పం, జూలై 3: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ గురుకుల విద్యాలయం, బందార్లపల్లె పంచాయతీ గడ్డూరు ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని వారు కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### వేలం ద్వారా రూ.3.42లక్షల ఆదాయం

రామకుప్పం, జూలై 3: రామకుప్పం పంచాయతీకి సంబంధించి వివిధ గుత్తల వేలం పాటలు బుధవారం ఎంపీడీఓ ఈశ్వరన్ ఆధ్వర్యంలో జరిగాయి. వేలం ద్వారా పంచాయతీకి రూ. 3.42లక్షల ఆదాయం సమకూరింది. వారపు సంత వేలం ద్వారా రూ.1,87,000, ప్రైవేటు బస్టాండు ద్వారా రూ.1,08000, దినసరి మార్కెట్ ద్వారా రూ.47000 ఆదాయం సమకూరింది. గత సంవతరం పై మూడు గుత్తల వేలం ద్వారా రూ.5,56,000 ఆదాయం వచ్చింది. కానీ ఈ సారి అది కేవలం రూ.3.42లక్షలకే పరిమితమైంది. టీడీపీ నాయకులు మునస్వామి, ఆనందరెడ్డి, నరసింహులు, ఆంజినేయరెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, జూలై 3: రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం పుంగనూరు సమీపంలో జరిగింది. రామసముద్రం మండలం ఎర్రబోయనిపల్లెకు చెందిన శాంతప్ప కుమారుడు మహేశ్ (20) పుంగనూరు ప్రభుత్వ డిగ్రీకాలేజీలో మూడవ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం ద్విచక్రవాహనంలో కాలేజీకి వస్తుండగా ప్రసన్నయ్యగారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో విద్యార్థి తలకు బలమైన గాయాలు తగలడంతో స్థానికులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

### మాదిగల సంక్షేమమే లక్ష్యం

చౌడేపల్లె, జూలై 3:మాదిగల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేయనున్నట్లు ఎమ్మార్పీఎస్ కన్వీనర్ నాగభూషణం పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక అంబేడ్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల సంక్షేమం కోసం క్షేత్ర స్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, ప్రతి మండలంలో పార్టీ జెండా అవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మొగలేశ్వర్, హరిబాబు, అంజప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరులో కలెక్టర్ విస్తృత పర్యటన





పలమనేరు ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పట్టుగూళ్ల విక్రయ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పలమనేరు, జూలై3 : పలమనేరులో కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోజూ వస్తున్న రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎముకల డాక్టర్, చర్మవ్యాధి నిపుణులు, జనరల్ మెడిసన్, రేడియాలజిస్టు కొరత వుందని సూపరింటెండెంట్ మమతారాణి కలెక్టర్‌కు వివరించారు. ఇతర ఆసుపత్రులకు డెప్యూటేషన్‌పై వెళ్లిన డాక్టర్లను తిరిగి రప్పించాల న్నారు. ల్యాబ్ పరికరాలను, రీజెంట్స్‌ను, అత్యవసర మందులను ఆరోగ్యశ్రీ నుంచి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నవజాత శిశువులకు సంబంధించి వార్మర్స్ కొనుగోలుకు, ఆపరేషన్ థియేటర్‌కు సంబంధించిన బాయిల్స్ ఆపరేటర్స్ కోసం తమ నిధులనుంచి రూ. 2 లక్షలు మంజూరు చేస్తానన్నిక లెక్టర్ ప్రకటించారు. అలాగే ఆసుపత్రిలో డయాలసిస్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రాజశేఖర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పట్టణ సమీపంలోని ప్రభుత్వ పట్టు గుడ్ల విక్రయకేంద్రాన్ని సందర్శించారు. పట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రంలో పట్టుగుడ్ల ఉత్పత్తి, పంపిణీ గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. పట్టు రైతులతో వారి సమస్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో పట్టుగూళ్లకు కిలోకు రూ.50 చొప్పున ఇస్తున్న ప్రోత్సాహకాన్ని గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందని దాన్ని పునరుద్ధరించాలని కోరారు. అటుపిమ్మట కలెక్టర్ పట్టు రీలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ జేడీ శోభారాణి, ఏడి కిషోర్‌నాయక్, పట్టుగూళ్ల ఉత్పత్తి కేంద్రం ఇన్‌చార్జి నగేష్, పట్టుగూళ్ల విక్రయకేంద్రం అధికారి అనిల్‌కుమార్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి నివేదిక సిద్ధం చేయండి : కంచర్ల



కుప్పం 8వ వార్డులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, జూలై 3: వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి అవసరమైన చర్యలతో నివేదిక సిద్ధం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అధికారులను ఆదేశించారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డుకు చెందిన పలార్లపల్లెలో వార్డు అభివృద్ధి సమీక్ష సమావేశం బుధవారం టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల అంతకుముందు వార్డులో పర్యటించారు. మురుగు కాలువలు, రోడ్లు, రేషన్ కార్డులు తదితర సమస్యల గురించి స్థానికులు ఆయన వద్ద ప్రస్తావించారు. అనంతరం ఆయన సమావేశంలో ప్రసంగిస్తూ, తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల సమస్యలు తీర్చడానికే ప్రథమ ప్రాధాన్యమిస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. దీనికి అధికారుల సహకారం ఎంతో అవసరమన్నారు. వారు వార్డులలో పర్యటించి స్థానిక సమస్యలను ముందుగా గుర్తించి, ఒక నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. దాని ప్రకారం ఆయా సమస్యల పరిష్కారంతోపాటు మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీజీ.ప్రతాప్, సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

#### ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కుప్పం ఆర్టీసీ డిపోలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హామీ ఇచ్చారు. కుప్పం డిపోలో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ)ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం డిపో నుంచి వెళ్లిపోయిన బస్సులన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో తిరిగి తెప్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం 98 బస్సులు వివిధ మార్గాలలో తిరుగుతున్నాయన్నారు. త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులు కూడా వస్తాయన్నారు. కుప్పం బస్‌స్టేషన్‌ను దేశంలోనే నెంబర్ వన్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, డిపో కార్యదర్శి ఇ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, దిలీప్, జయశంకర్, శ్రీను, టీవీ.కుమార్, భాస్కర్, బ్రహ్మం, బీవీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయం ఉన్న గ్రామాలకే మొదటి ప్రాధాన్యత



దేవాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, జులై 3: కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ఉన్న గ్రామాలకే అభివృద్ధిలో మొదటి పాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన మండల పార్టీ అధ్యక్షుడు బాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందింగం ఉదయకుమార్‌తో కలిసి మండలంలో పర్యటించారు. కెనమాకులపల్లె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. తరువాత శాంతిపురం సబ్‌స్టేషన్ వద్ద రాళ్ళగంగమ్మ దేవాలయానికి కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మండల పార్టీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ నాగభూషణంరెడ్డి సహకారంతో మండల తెలుగు మహిళ కమిటీ సభ్యులకు చీరల పంపిణీ చేశారు. అలాగే తొలసినాయనపల్లెలో జరిగిన గంగజాతరకు హాజరై సల్లాపురెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, రాజేంద్ర, జయారెడ్డి, రమేష్, రాజారెడ్డి, దేవరాజులునాయుడు, కేశవులు, రామకృష్ణ, క్యాబేజి మురళి, శ్యాంతరామ్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు శ్యామల, కుప్పం నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు అనసూయ, మహిళ నేతలు సుగుణమ్మ, రూప, సరిత, హేమ, పౌలారాణి, సుగుణ, లక్ష్మమ్మ, రుక్మిణి, నడింపల్లె రూప, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

### ఆవులకుప్పంలో గంగ జాతర





విశేష అలంకరణలో గంగమ్మ, గెరిగె ఊరేగింపు

రామకుప్పం, జూలై 3: మండల పరిధి ఆవులకుప్పంలో మంగళ, బుధవారాల్లో గంగ జాతర వేడుకలు కోలాహలంగా జరిగాయి. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని, పచ్చిగెరిగెను గ్రామ వీధుల్లో డప్పుల హోరు, బాణసంచా పేలుళ్ళ మధ్య ఊరేగించారు. భక్తులు అడుగడుగునా అమ్మవారికి, పచ్చిగెరిగెకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. గ్రామస్తులు మేళతాళాలు, డప్పుల హోరు మధ్య ఊరేగింపుగా గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్ళు పెట్టి, దీపారాధనలు చేశారు. పలువురు అమ్మవారికి గొర్రెలు, కోళ్ళు బలిచ్చారు.

## సీఐ, ఎస్ఐలకు ప్రశంసా పత్రాలు







ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న చౌడేపల్లె ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి, కల్లూరు సీఐ శ్రీనివాసులు

కల్లూరు, జూలై 3: ఇటీవల ఎన్నికల్లో ఉత్తమ సేవలు అందించిన కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డికి ఎస్పీ మణికంఠ చందోలు మంగళవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరితో పాటు స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ శ్రీనాథ్ ఉత్తమ సేవలు అందించడంతో వీరికి ప్రశంసాపత్రం లభించింది.

**చౌడేపల్లె** : చౌడేపల్లె ఎస్ఐ ప్రతాప్‌రెడ్డికి ఉత్తమ సేవా అవార్డును ఎస్పీ మణికంఠ చందోల్ ప్రదానం చేశారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంశాపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.

### మానవత్వం చాటుకున్న సచివాలయ ఉద్యోగులు







ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న పింఛన్‌దారులకు పెన్షన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

గంగవరం, జూలై 3 : అనారోగ్యం బారినపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పింఛన్‌దారులకు పెన్షన్ అందించి సచివాలయ ఉద్యోగులు మానవత్వం చాటుకున్నారు. మంగళవారం మేలుమాయి పంచాయతీ చిన్నమనాయినిపల్లెకు చెందిన శ్రీరాములు క్యాన్సర్ బారిన పడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతుండగా, వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ వెళ్లి రూ.7 వేల పింఛన్ అందించారు. అలాగే కల్లుపల్లికి చెందిన రామచంద్రమూర్తి వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తెలుసుకున్న కల్లుపల్లె వెల్ఫేర్ అసిస్టెంట్ అన్నూరు శ్రావణి అక్కడికి వెళ్లి పింఛన్ అందించారు. మామడుగు పంచాయతీ కంచిరెడ్డిపల్లెకు చెందిన శాంతమ్మ స్విమ్స్‌లో చికిత్స పొందుతుండగా సచివాలయ మహిళా పోలీస్ షణ్ముగప్రియ తిరుపతికి చేరుకొని పింఛన్ అందించారు.

### అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

వి.కోట, జూలై 3: మండల పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎనిమిది ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో మాధవీలత తెలిపారు. వి.కోట మండలం మద్దిరాళ్ళ, ఎగువ గంధారమాకులపల్లె కేంద్రాల్లో అంగన్‌కార్యకర్తల పోస్టులకు జనరల్ కేటగిరిలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. కె.నక్కనపల్లె, పడిగలకుప్పం-2, నెర్నపల్లె, పాపేపల్లె కేంద్రాల్లో జనరల్ కేటగిరి అభ్యర్థులు, గాండ్లపల్లె బీసీ (ఏ), వెంకటేపల్లెకు (బీసీ-బి), కల్లుపల్లె (బీసీ-ఈ), జవ్వునిపల్లెకు ఎస్సీ కేటగిరీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు పదవతరగతి పాసై, 35ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. ఈనెల 19వ తేది సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

#### రొంపిచెర్ల మండలంలో..

**రొంపిచెర్ల** : మండలంలోని బోడిపాటివారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులూపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కొక్క ఆయా పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో నాజసైలజ తెలిపారు. గ్రామ పరిధిలో ఉండి, 10వ తరగతి పాస్ అయి, 35 సంవత్సరాలు వయసు లోబడి ఉండాలని ఆమె తెలిపారు.

# చిత్తూరు
## జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి



### హిందువులకు రాహుల్ క్షమాపణ చెప్పాలి : బీజేపీ


నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు (సెంట్రల్), జూలై 3: హిందూ సమాజానికి పార్లమెంట్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రాహుల్ హిందూ సమాజంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వారు బుధవారం గాంధీ విగ్రహం ముందు నిరసన తెలిపారు. రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు మాట్లాడుతూ హిందువులు అసత్యాన్ని పలుకుతారు, హిందూ సమాజం హింస, హింస అంటూ జీవిస్తోందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవడమేగాక క్షమాపణ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు బ్రహ్మానందం, రామభద్ర, కరుణాకర్, రామ్మూర్తి, వెంకటేష్, పాండిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఏఆర్ ఆర్ఐగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, జూలై 3: ఏఆర్ ఆర్ఐ(అడ్మిన్)గా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్ఐగా ఉన్న నీలకంఠేశ్వర్‌రెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొంది ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ(అప్పా)కి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో హోంగార్డు ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌ను ప్రభుత్వ బదిలీ చేసింది. ఆయన బుధవారం బాధ్యతలు తీసుకుని, ఎస్పీ మణికంఠను మర్యాదపూర్వకంగా కలిశారు.

### మొక్కలు నాటడం సంప్రదాయం కావాలి


మొక్కలు నాటుతున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు (సెంట్రల్), జూలై 3: మొక్కలు నాటడం సంప్రదాయంగా మారాలని బీజేపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక 28వ డివిజన్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మపేరుపై ఓ మొక్క నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నేడు నాటిన మొక్క భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణం అందిస్తుందన్నారు. నాయకులు శ్రీనివాసన్, సురేష్, షణ్ముగం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### వాహన పార్కింగ్ షెడ్డు ప్రారంభం


యూనిఫాం అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 3: ఏఆర్ కార్యాలయం వద్ద సిబ్బంది సౌకర్యార్థం బైక్ పార్కింగ్ షెడ్డును ఎస్పీ మణికంఠ బుధవారం ప్రారంభించారు. పోలీసు సిబ్బంది సౌకర్యాల మెరుగునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోలీసు బ్యాండ్ సిబ్బందికి యూనిఫాం అందించారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్‌బాషా, ఇలియాజ్ బాషా, సీఐలు ఉలసయ్య, రవిశంకర్‌రెడ్డి, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

### కలెక్టర్‌కు ఎన్జీవో సంఘ నేతల సన్మానం



చిత్తూరు, జూలై 3: నూతన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను బుధవారం ఏపీ ఎన్జీవో నేతలు సన్మానించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీ రాఘవులు, కార్యదర్శి రఘు, నేతలు బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తంరెడ్డి, ప్రదీప్, మురుగేశ్, రమేష్, సురేష్, మహేష్, ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రజా, దళిత సంఘాల జేఏసీ నేతలు కలెక్టర్‌ను సత్కరించారు. మునస్వామి, ధనంజయ రావు, దామోదరం, గోవిందన్, రవి, ఆర్ముగం పాల్గొన్నారు.

### చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



విజయపురం, జూలై 3: విజయపురంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులు బుధవారం పాలాభిషేకం చేశారు. పింఛను రూ.6 వేలకు పెంచడంతో తమలో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. చంద్రబాబుకు రుణపడి ఉంటామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్, దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు ఏసుపాదం, దివ్యాంగులు భాస్కర్‌నాయుడు, సంజీవరాజు, రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

### విద్యా సామగ్రి వితరణ



విజయపురం, జూలై 3: మండలంలోని ఎల్లసముద్రం ప్రాథమిక పాఠశాలలో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య బుధవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. నోటుపుస్తకాలు, క్రయన్స్, పెన్నులు, పెన్సిల్ తదితరాలు అందించారు. హెచ్ఎం వంశీకృష్ణ, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


గాయపడిన లోకనాథం - రోషన్

గుడిపాల, జూలై 3: మండలంలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలోని బొమ్మ సముద్రం క్రాస్ వద్ద బెంగళూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న సుమో ఎదురుగా వస్తున్న మండలంలోని చామంతిపురానికి చెందిన లోకనాథమందడి బుల్లెట్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లోకనాథం తీవ్రంగా గాయపడ్డాడు. కాగా, అదే మార్గంలో ద్విచక్ర వాహనంలో రాణిపేట నుంచి చిత్తూరు వైపు వస్తున్న యాదమరి మండలం వరదరాజులపల్లెకు చెందిన జేమ్స్ కుమారుడు జాంటీరోడ్స్ అనుప క్రాస్ సబ్‌స్టేషన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ నరేంద్రకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### చెరువులో పడి అసోం యువకుడి మృతి


అనిల్‌ముండా మృతదేహం

గుడిపాల, జూలై 3: మండలంలోని గట్టాళ్లమిట్ట బొమ్మినాయని చెరువులో పడి బుధవారం అసోంకు చెందిన యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ నరేంద్రకుమార్ వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం అసోం రాష్ట్రానికి చెందిన అనిల్‌ముండా జీవనోపాధి కోసం మండలానికి వచ్చాడు. మద్యం మత్తులో చెరువులో పడిపోయాడా లేదా ఎవరైనా కొట్టి చెరువులో తోసేశారా అన్న విషయం విచారణలో తేలాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. చేపలు పట్టడానికి వెళ్లారని కొందరు, అక్కడే స్నేహితులతో కలిసి సారా తాగాడని మరికొందరు చెబుతున్నారు.

### అర్హులకు ఇళ్ల స్థలాలిస్తాం : గురజాల

గుడిపాల, జూలై 3: మండలంలో ప్రభుత్వ భూములను మూడు నెలల్లో ప్రక్షాళన చేసి, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో చెరువులు, డీకేటీ భూముల్లో వందల ఎకరాలు కబ్జాకు గురయ్యాయని, వాటిని సర్వే చేయించి, ప్రక్షాళన చేస్తానని తెలిపారు. కబ్జాకు పాల్పడిన వారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదన్నారు.

### పోలవరంలో డయేరియాపై అవగాహన

పూతలపట్టు, జూలై 3: మండలంలోని పోలవరం గ్రామంలో బుధవారం పూతలపట్టు వైద్యాధికారులు డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పూతలపట్టు వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక, సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

### నందీశ్వరుడికి ప్రదోష పూజలు



కార్వేటినగరం, జూలై 3: స్థానిక శివాలయంలోని నందీశ్వరుడికి బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

### నేడు అల్లూరి జయంతి

చిత్తూరు, జూలై 3: పాత గ్రీవెన్స్ హాలులో గురువారం ఉదయం 10.30 గంటలకు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమాధికారి రబ్బాని బాషా తెలిపారు. అల్లూరి జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

### రేపు జాబ్‌మేళా

చిత్తూరు, జూలై 3: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 5వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కియా, శ్రీరామ్ ఫార్చ్యూన్, సుగుణ ఫుడ్స్ కంపెనీలలో పలు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 30ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు బయోడేటాతో హాజరుకావాలని కోరారు.

### గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

పాలసముద్రం, జూలై 3: గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో రామనాథరెడ్డి ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల పురోగతి, పెండింగ్ బిల్లుల గురించి అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్య దర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### పంట నష్టపోయిన రైతుకు పరిహారం



చిత్తూరు కలెక్టరేట్, జూలై 3: అగ్ని ప్రమాదంలో పంట కోల్పోయిన రైతుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం రూ.35వేల చెక్కును తన చాంబర్‌లో అందించారు. పెనుమూరు మండలం ఎల్లంపల్లెకు చెందిన జగన్నాథం నాయుడు తన పొలంలో అల్ల నేరేడు చెట్లు వేశాడు. ఇటీవల అగ్నిప్రమాదం జరిగి చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. పరిహారం చెల్లించాలని రైతు పెనుమూరు తహసీల్దార్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఫండ్ నుంచి ఆయనకు ఆర్థికసాయం అందించారు.

### 6న అంతర్జాతీయ సహకార దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 3: జిల్లావ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు, సంస్థల్లో ఈనెల 6వ తేదీన అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. డీసీవో నాగవర్ధన, జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, డీఎల్‌సీవో వనజ, సహకార విద్యా అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి



కార్వేటినగరం, జూలై 3: అనారోగ్యంతో మృతిచెందిన ఎంఎం విలాసం గ్రామ పంచాయతీ గుండుగాని దళితవాడకు చెందిన టీడీపీ కార్యకర్త యశోదమ్మకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ నివాళి అర్పించారు. పార్టీకి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఎంఎం విలాసం మాజీ సర్పంచ్ చలంపాలెం చిరంజీవి పాల్గొన్నారు.

### ఎంపీడీవో ఆఫీసులో పేరుకున్న చెత్త



కార్వేటినగరం, జూలై 3: ఎంపీడీవో కార్యాలయంలో, పరిసరాల్లో చెత్త పేరుకుపోయింది. అపరిశుభ్ర పరిసరాలతో అక్కడికి వచ్చే జనం ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గాలి వచ్చినప్పుడు దుమ్ము రేగి కళ్లలో పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అటు సిబ్బందిని, ఇటు అర్జీదారులను ఇబ్బంది పెడుతున్న చెత్తపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

### నేడు గ్రామసభ

కార్వేటినగరం, జూలై 3: కార్వేటినగరం గ్రామ సభ గురువారం ఉదయం 10 గంటలకు సర్పంచ్ ధనంజయ వర్మ ఆధ్వర్యంలో జరుగుతుందని పంచాయతీ కార్యనిర్వహణాధికారి మణి తెలిపారు. పంచాయతీ వార్డు సభ్యులు హాజరుకావాలని కోరారు.

### అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశులు

నింద్ర, జూలై 3: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి నాయకులు పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నింద్రలో ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఐక్యంగా ఉంటూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. నాయకులు దశరథవాసు, రవినాయుడు, ధనంజయులు నాయుడు, విజయకుమార్, బాబుయాదవ్, పరదేశి, జగన్, మనోజ్ యాదవ్, ఓంప్రకాష్, తేజేష్, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### 6న వాహనాల వేలం

చిత్తూరు సిటీ, జూలై 3 : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 6వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ అర్బన్ సీఐ విజయకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు వేలం వేయనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆరో తేదీ ఉదయం 10 గంటలకు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి, వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

# కేంద్రీయ విద్యాలయకు అడుగులు

- కేంద్ర కమిషనర్‌కు లేఖ రాసిన చిత్తూరు ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, జూలై 3: జిల్లా కేంద్రం చిత్తూరుకు కేంద్రీయ విద్యాలయ ప్రతిపాదన ఏళ్లుగా నడుస్తోంది. చిత్తూరుకు మంజూరైనా గత ప్రభుత్వం, పాలకులు అవసరమైన సరైన స్థలాన్ని చూపించలేకపోవడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. అదే సమయంలో అన్నమయ్య జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయ ప్రారంభం కూడా అయిపోయింది. జిల్లాల విభజన తర్వాత చిత్తూరులో చెప్పుకోదగ్గ విద్యాసంస్థ ఏదీ లేకుండా పోయింది. దీంతో స్థానిక ప్రజలు చిత్తూరుకు కేంద్రీయ విద్యాలయ, విశ్వవిద్యాలయం మంజూరు చేయాలని పలుమార్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గెలిచిన తక్కువ సమయంలోనే కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అడుగులు ముందుకు వేశారు. బుధవారం ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంగతన్ కమిషనర్‌కు లేఖ రాశారు. ఇప్పటికే మంజూరైన ఈ విద్యాలయను ఎమ్మెల్యే చొరవతో త్వరలోనే చిత్తూరులో ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యే రాసిన లేఖతో సామాజిక మాధ్యమాల్లో చిత్తూరు నెటిజన్లు, నగర వాసులు, జిల్లా ప్రజలు సర్వత్రా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఉపాధి అవకాశాలు కల్పించండి


కేంద్ర మంత్రికి విన్నవిస్తున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జూలై3 : జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కేంద్ర మంత్రి జితిన్ రామ్ మంజియాను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో మంత్రిని ఎంపీ కలిసి మాట్లాడారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు లేక యువత పక్క రాష్ట్రాలకు వెళుతున్నారని వివరించారు. జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జీడీనెల్లూరు నియోజకవర్గంలోని లెదర్ ఫ్యాక్టరీ, నగరి నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్క్, కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో గుజ్జు పరిశ్రమలు, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు.

### విశ్వ బ్రాహ్మణులను ఆదుకోండి


ఎమ్మెల్యే గురజాలను సన్మానిస్తున్న సంఘం నేతలు

చిత్తూరు సిటీ, జూలై 3: విశ్వబ్రాహ్మణులకు చేయూతనిచ్చి ఆదుకోవాలని ఆ సంఘం నేతలు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను కోరారు. నగరంలోని బీవీ రెడ్డి కాలనీలో ఉన్న ఎమ్మెల్యేను బుధవారం వారు సన్మానించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు దయానందాచారి, నేతలు కృష్ణమాచారి, హేమచంద్ర, శివకుమార్, ఉమాశంకర్, మునస్వామి, సురేష్, సుబ్రమణ్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా ద్రౌపదీ కల్యాణం


పూజల్లో ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, జూలై 3: మండలంలోని దిగువమాఘం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో బుధవారం ద్రౌపదీ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. ఆలయాధికారులు ఆయనకు అమ్మవారి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు. జోతీశ్వర్ నాయుడు, దామునాయుడు, రాజశేఖర్‌నాయుడు, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, ధనంజయ నాయుడు, మణినాయుడు, హరిబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

### విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి


ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నగరి, జూలై 3: నగరిలో గురువారం నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్‌కు సహకరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయలకు వినతిపత్రం సమర్పించారు. ఐక్య విద్యార్థి సంఘంతో పాటు ఎంఈవోలను కలసిన ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయకుమార్ బంద్ ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు బాషా, రోహిత్, కామరాజు, ముని, విశాల్, గణేష్ పాల్గొన్నారు.

### బీసీ భవన్ శిలాఫలకంలో సీఎం పేరు ముద్రించాలి


కలెక్టర్‌కు షణ్ముగం సన్మానం

చిత్తూరు సిటీ, జూలై 3: జిల్లా కేంద్రంలో నిర్మించిన బీసీ భవన్ ప్రారంభోత్సవ శిలాఫలకంలో సీఎం చంద్రబాబు పేరు ముద్రించాలని టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఆయన కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి శిలాఫలకంలో అప్పటి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు పేరులేకుండా శిలాఫలకం ఏర్పాటు చేశారన్నారు. బీసీ భవన్ ప్రహరీ గోడ నిర్మాణం త్వరగా పూర్తిచేసి, భవనం ముందు మహాత్మ జ్యోతీరావ్ పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని విన్నవించారు.

### ఎఫ్‌సీ చేసుకోని బస్సులను సీజ్ చేస్తాం

చిత్తూరు సిటీ, జూలై 3: పాఠశాలలు, కళాశాలల బస్సులు ఎఫ్‌సీ లేకుండా రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామని డీటీసీ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా స్కూల్, పాఠశాలల బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే తనిఖీలు ప్రారంభించారు. ఎఫ్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటివి లేని 10 బస్సులపై కేసులు నమోదు చేశామని, 3 బస్సులను సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. డ్రైవ్‌లో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాదవర్మ, భాగ్యశ్రీ పాల్గొన్నారు.

### అదృశ్యమైన బాలుడు తిరిగివచ్చాడు


బాలుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుదర్శన్ ప్రసాద్

పూతలపట్టు, జూలై 3: మండలంలోని పాలకూరు గ్రామానికి చెందిన బాలుడు గోపి బుధవారం స్వగ్రామానికి తిరిగివచ్చాడు. ఆ బాలుడు గ్రామ సమీపంలోని ఓ బావిలో తన పాదరక్షలను పడేసి గత నెల 10వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు, చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది అదేరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బావిలో గాలింపు చర్యలు చేపట్టినా లాభం లేకపోయింది. అప్పటి నుంచి ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు బుధవారం గోపి ఇంటికి చేరుకోవడంతో ఎంతో సంబరపడ్డారు. బాలుడితో పాటు తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి సీఐ సుదర్శన్ ప్రసాద్ కౌన్సెలింగ్ ఇచ్చారు.

### దోమలను నివారిద్దాం..డెంగ్యూను అరికడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూలై 3: దోమలను నివారించి, డెంగ్యూను అరికడదామని డాక్టర్ సింధూర అన్నారు. బుధవారం కాణిపాకం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పుత్రమద్దిలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. సింధూర మాట్లాడుతూ టైగర్ దోమ కారణంగా డెంగ్యూ ప్రబలుతుందని, తీవ్ర తలనొప్పి, కండరాల నొప్పి, వికారం, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలుంటే వెంటనే దగ్గర్లోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, శుక్రవారం డ్రైడేగా పాటించాలని అన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి శివయ్య, పబ్లిక్ హెల్త్ నర్స్ వేదవతి, హెల్త్ సూపర్‌వైజర్ మనోరమ పాల్గొన్నారు.

### అభ్యసనా సామగ్రి పంపిణీ



నగరి, జూలై 3: టీఆర్ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బాల మురుగన్ స్టోర్స్ యజమాని రాధాకృష్ణ విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. బుధవారం పాఠశాలకు వెళ్లిన ఆయన ఎంఈవో నమఃశివాయం ద్వారా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు అందించారు. ఎంఈవో మాట్లాడుతూ దాత సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. హెచ్ఎం కవిత, పీసీ చైర్మన్ వెంకటేష్ పాల్గొన్నారు.

### లోకేశ్‌ను కలిసిన ఎన్ఆర్ఐ విక్రమ్



బంగారుపాళ్యం, జూలై 3: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మండలంలోని నలగాంపల్లె గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఎన్‌పీ విక్రమ్ తన మిత్రబృందంతో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. చందు, నవీన్ చౌదరి, దుర్గా తదితరులు ఆయన వెంట ఉన్నారు.

### సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జి అధికారికి సన్మానం



గంగాధరనెల్లూరు, జూలై 3: గంగాధరనెల్లూరు సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జి అధికారి ఎస్.శ్రీనివాసులురెడ్డికి సింగిల్‌విండో అధికారులు, డీసీసీబీ బ్రాంచ్ బ్యాంక్ అధికారులు కలిసి బుధవారం సన్మానం చేశారు. సింగిల్ విండో సొసైటీ సీఈవో విజయకుమార్‌రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ బ్యాంక్ మేనేజర్ మహేష్, సూపర్‌వైజర్ విజయ, సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి పాల్గొన్నారు.

### చిత్తూరులో చిరుజల్లులు

చిత్తూరు కల్చరల్, జూలై 3: నగరంలో బుధవారం పగలంతా ఉక్కపోతతో ప్రజలు అవస్థపడ్డారు. సాయంత్రం చిరుజల్లులతో నగరవాసులు సేదదీరారు. చల్లటి గాలితోపాటు జల్లులు పడడంతో అందులో తడుస్తూ పులకించిపోయారు.

### నేటి నుంచి ఆషాడమాస పూజలు

చిత్తూరు కల్చరల్, జూలై 3: నగరంలోని ఆలయాల్లో గురువారం నుంచి తెలుగు ఆషాడమాస పూజలు నిర్వహించనున్నారు. కట్టమంచి వరదరాజస్వామి, కోదండ రామాలయం, రాజుగుడి, సంతపేట రంగనాథస్వామి ఆలయాల్లో ఆరో తేదీ వరకు నిత్య కైంకర్యాలు, ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈనెల 17వ తేదీ నుంచి తమిళ ఆషాడమాస పూజలు నెల రోజులు చేయనున్నారు.

### 20, 21 తేదీల్లో గురుపౌర్ణమి

చిత్తూరు కల్చరల్, జూలై 3: కట్టమంచి షిరిడి విశ్వ సాయి బాబా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరవాసులు పాల్గొని బాబా అనుగ్రహం పొందాలని కోరారు.

### రేషన్ దుకాణం ప్రారంభం

చిత్తూరు సిటీ, జూలై 3: నగరంలోని 5వ డివిజన్‌లో రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం, పప్పు, చక్కెర తదితరాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చెన్నకేశవులు నాయుడు, త్యాగరాజన్, కిషోర్, టీకే నాయుడు, ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, రామదాసు, తారాపతి, శ్రీనివాసులు, కిరణ్, అనురాధ, అమరనాథనాయుడు, గోపాల్ పాల్గొన్నారు.

### నింద్ర స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

నింద్ర, జూలై 3: నింద్ర పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మణికంఠ బుధవారం తనిఖీలు చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల పురోగతి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసుల ద్వారా విద్యా సంస్థలలో అవగాహన సదస్సులు నిర్వహించి, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి తెలియజేయాలని చెప్పారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. నగరి రూరల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి, నింద్ర ఎస్ఐ రామచంద్ర, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పక్కా భవన 'వెలుగు'లకు నిరీక్షణ


పిల్లర్లకే పరిమితమైన వెలుగు కార్యాలయంలో పిచ్చిమొక్కలు

గంగాధరనెల్లూరు, జూలై 3: నియోజకవర్గ కేంద్రంలో వెలుగు (ఇందిరాక్రాంతి పథం) కార్యాలయానికి సుమారు 24 ఏళ్ళుగా పక్కాభవనం సౌకర్యంలేదు. అద్దెభవనంలోనే కొనసాగుతోంది. 2011లో మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ హయాంలో భవన నిర్మాణానికి రూ.25లక్షలు మంజూరు చేయించారు. అదే ఏడాది సెప్టెంబరులో శంకుస్థాపన చేశారు. పిల్లర్లతో బేస్‌మెంట్ వరకు పనులయ్యాయి. ఓవ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కోర్టును ఆశ్రయించిన వ్యక్తి కొంతకాలానికి మరణించారు. ప్రస్తుతం ఆస్థలంలో ముళ్ళకంపలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. సమావేశం పెట్టుకోడానికి తగినంత చోటులేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వెలుగు భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.